## మన(సు)లో మాట

సంఘమిత్ర అందరికీ శ్రీ **దుర్ముఖి** నామ సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈ సంవత్సరము తలపెట్టిన సత్కార్యములన్నీ ఫలవంతమై, విజయవంతమై, ప్రపంచము సుఖ శాంతులతో, పాడి పంటలతో, దేశానికి దేశానికి మధ్య చక్కని సంబంధబాంధవ్యాలు ఏర్పడి, వసుదైక కుటుంబముగా మెలగాలని ఆకాంక్షిస్తున్నది.

ఉద్యోగపరమైన కొన్ని సమస్యల కారణముగా 'సంఘమిత్ర' ప్రచురణ జులై మాసం 2011 తరువాత జరగలేదు. అలాగే 2011వ సంవత్సరములో శ్రీనివాసరామానుజన్ మేథమేటిక్స్ క్లబ్‌నిర్వహించే వేసవి వేదగణిత తరగతులు నిర్వహించబడలేదు. దైవానుగ్రహమువల్ల మళ్ళీ 2012లో ఈ తరగతులను రెండు ప్రాంతములలో శని, ఆది వారములలో విజయవంతముగా నిర్వహించడము జరిగింది. విశేషములు **రానున్న సంచికలలో** చూడగలరు. **గత నాలుగు సంవత్సరములలో** వేదగణిత పద్ధతులను ఉపయోగించి బీజగణిత సమస్యలను**, రేఖాగణితం, త్రికోణమితి సమస్యలను** సులువుగా ఎలా పరిష్కరించవచ్చో తెలియజేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాము. ఈ కార్యక్రమాన్ని ప్రకటించిన 48 గంటలలోనే 20 మందికి పైగా నమోదు చేసుకోవడము వారికిగల ఆసక్తిని తెలియజేస్తోంది.

లూసియానా రాష్ట్రములోని మన్రో నగరములో 2012 సంవత్సరము డిశంబరు 15వ తేదీన ఒక క్రైస్తవ ప్రార్థనా మందిరములో నిర్వహించబడిన 2 గంటల ప్రసంగమునకు విశేష స్పందన లభించింది. ఈ విధముగా వేదగణిత పద్ధతులను గురించి, గణితమును సులువుగా నేర్చుకునే పద్ధతులను గురించి నిర్వహించబడే కార్యక్రమాలు వసంత వేసవి కాలములకే పరిమితము చేయకుండా - సంవత్సరములో అవకాశము వచ్చిన ప్రతిసారి నిర్వహించడానికి శ్రీనివాసరామానుజన్ మేథమేటిక్స్ క్లబ్ నిర్ణయించుకుంది. 'ప్రాక్టికాలిక్యులేషన్ యూజింగ్ వేదిక్ మాథమేటిక్స్', 'ఫన్ డైమన్షన్ ఆఫ్ మేథమేటిక్స్' మొదలైన కార్యక్రమములతో శ్రీనివాసరామానుజన్ మేథమేటిక్స్ క్లబ్ 2 గంటల సదస్సులను నిర్వహిస్తున్న విషయము మీకు తెలిసినదే. ఈ కార్యక్రమముల ద్వారా అంకగణితమే కాకుండా, బీజగణితము, త్రికోణమితి, రేఖాగణిత పద్ధతులలో వేదగణితమును ఎలా ఉపయోగించవచ్చో తెలియజేయడము ఎందరికో ఉపకరిస్తున్నదని పలువురి స్పందన.

ఇంచుమించు **ఐదు** సంవత్సరముల అనంతరము ఈ పత్రికను తిరిగి ప్రచురించగలిగినందుకు మహదానందముగా నున్నది. ప్రపంచములో అన్ని మూలలనుండి మాకు అందిన ఆ ఉత్తరములు (తపాల ఉత్తరములు), ఈ ఉత్తరములు (ఈ-మెయిల్స్), దూరశ్రవణ యంత్రముద్వారా పిలుపులు (ఫోన్ కాల్స్) మీకు 'సంఘమిత్ర'పైనున్న అభిమానానికి నిలువెత్తు దర్పణం. సంఘమిత్ర తరపున మీకు, మీరు అందిస్తున్న ప్రోత్సాహమునకు మా హృదయపూర్వక ధన్యవాదములు. పాఠకులందరికి మరొకసారి వారి రచనలను పంపడానికి ఆహ్వానిస్తున్నాము. మీకు తెలిసిన విషయములను మిగిలిన పాఠక సోదరులతో పంచుకోడానికి ఇది చక్కని వేదిక. మీరు మీ ఆలోచనలను పాఠకులతో పంచుకోవాలని అనుకుంటే ainapura@yahoo.com కి ఈ-మెయిలు పంపండి.

మళ్ళీ **జులై** సంచికలో కలుద్దాం! అంతవరకు సెలవు. అభినందనలతో ...

సంఘమిత్ర సంపాదక వర్గం.